క్లుప్తంగా

రేపు గడప గడపకు మన ప్రభుత్వం

గురజాల : మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ అన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొంటారన్నారు. మండలంలోని కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కొలువుదీరిన గణనాథుని ప్రతిమలు



కారెంపూడి: వినాయక చవితి వేడుకలకు వినాయక ప్రతిమలను కళాకారులు కారెంపూడిలో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వచ్చే సోమవారం జరగనున్న వినాయక చవితి వేడుకలకు కళాకారులు తయారు చేసిన విగ్రహాలు కారెంపూడిలో కనువిందు చేస్తున్నాయి. సుమారు ఏడాది కాలంగా రాజస్తాన్ కళాకారులు వినాయక ప్రతిమలను వివిధ రూపాలలో తయారు చేశారు. ఇదిలా ఉంటే వినాయక చవితి సామూహిక వేడుకలకు ఏర్పాట్లు చేసుకున్న వివిధ గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీలు విగ్రహాల కొనుగోలుకు ముందుగానే తయారీదారులకు అడ్వాన్స్‌లిచ్చి వెళ్తున్నారు. కారెంపూడిలో సుమారు రెండు వందల దాకా వినాయక విగ్రహాలను కళాకారులు తయారు చేసి మండపాలలో పూజలకు ముస్తాబు చేశారు.

నూతన పింఛన్లు అందజేత



పిడుగురాళ్ల: పట్టణంలోని 17వ సచివాలయంలో కొత్త పింఛన్లను కౌన్సిలర్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎవరో ఒకరు చనిపోతే కానీ రాని పింఛన్ ఇప్పుడు అర్హులై ఉంటే చాలు ఎంత మందికైనా ఇస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జానీ, ఉప్పు వెంకటేశ్వర్లు, దేవళ్ల నాగరాజు, 32వ వార్డు ఇన్‌చార్జి ఏడీ అలీమ్, 31వ వార్డు కన్వీనర్ తన్నీరు బాలు, తోడేటి రాజు, వలంటీర్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి కోటి తమలపాకుల పూజ



పిడుగురాళ్ల: పట్టణ శివారులోని శ్రీనివాస్ కాలనీలోని ప్రసన్నాంజనేయస్వామికి మంగళవారం కోటి తమలపాకులతో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

చల్లంగా చూడమ్మ పోలేరమ్మ తల్లి



పెదకూరపాడు: ప్రకృతి వైపరీత్యాల నుంచి, వ్యాధి బాధల నుంచి చల్లంగా చూడమని గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి రైతులు, వ్యవసాయ కూలీలు పొంగళ్లు పొంగించారు. పెదకూరపాడులోని పోలేరమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున మహిళ భక్తులు అమ్మవారికి పొంగళ్లు నివేదించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, జీ.రఘు, మల్లేశ్వరి, దర్శి శ్రీనివాసరావు, పాల్గొన్నారు. రాత్రి ఆచార్య తుళ్లూరు శివ ఆధ్వర్యంలో కోలాట కార్యక్రమం నిర్వహించారు.

మహంకాళీ అమ్మవారి దేవస్థానంకు విరాళం

నరసరావుపేట: మండలంలోని ఇసప్పాలెం శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం జీర్ణోద్ధరణ పనులకు హోలీవుడ్ షాపు అధినేత చింతగుంట రఘురామిరెడ్డి రూ.1,00,116లు విరాళం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గృహంలో ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డికి ఎమ్మెల్యే గోపిరెడ్డి చేతుల మీదుగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు పాల్గొన్నారు.

171వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం

- గడప గడపకూ సంక్షేమ పథకాలు... ప్రభుత్వ విప్ పీఆర్కే
- గ్రామానికి ఇప్పటి వరకు రూ.65.47 కోట్లు అందజేత



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి

రెంటచింతల: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి తగ్గ వారసుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందచేస్తూ సంక్షేమ విప్లవాన్ని తీసుకువచ్చారని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 42 వ సచివాలయంలో 171 వ రోజు మంగళవారం ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మండల కేంద్రమైన రెంటచింతల గ్రామంలోని ఎర్రబాలెం కాలనీలో ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేసి 4 సం. 4 నెలల కాలంలో ప్రతి కుటుంబానికి సీఎం జగన్ ఎంత ఆర్థిక ప్రయోజనం కల్పించారో వివరించారు. దేశ చరిత్రలో ఒకేసారి 32 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, విద్యా దీవెన, వైఎస్సార్ సున్నా వడ్డీ(డ్వాక్రా), వైఎస్సార్ భరోసా, జగనన్న గోరు ముద్ద, పథకాలతో సీఎం జగన్ సమాజంలో విప్లవాత్మకమైన మార్పుకు శ్రీకారం చుట్టారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం ద్వారా వేల కోట్ల రూపాయలతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి చరిత్ర సృష్టించారన్నారు. రైతులను ఆదుకునేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, యంత్రపరికరాలు, ట్రాక్టర్లను, వరికోత యంత్రాలను రాయితీపై అందచేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన తీసుకువచ్చిన సీఎం జగన్ మహాత్మాగాంధీ కలలను నిజం చేశారన్నారు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నేరుగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంతో వారు చూపుతున్న ఆదరాభిమానాలు వెలకట్టలేనివన్నారు. గ్రామాభివృద్ధికి, గ్రామ ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటి వరకు మొత్తం రూ. 65.47 కోట్లు జగనన్న ప్రభుత్వం అందచేసినట్లు పీఆర్కే వివరించారు. మా కుటుంబాలకు వివిధ పథకాల ద్వారా ఎంతో లబ్ధి చేకూరిందని మేము జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని ప్రతి గడపలో వారి ఆనందాన్ని పీఆర్కేతో పంచుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఎంతో ఆర్థిక భరోసా కల్పించిన సీఎం జగన్‌కు మేము ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో చేకూరని విధంగా ప్రతి కుటుంబానికి రూ.90 వేల నుంచి రూ.5.25 లక్షల వరకు లబ్ధి చేకూరిందని పీఆర్కే పేర్కొన్నారు. ముందుగా కాలనీ వాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పీఆర్కేకు క ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య, ఉప సర్పంచ్ పేర్ల చౌడమ్మ, జెడ్పీ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మండల ప్రత్యేక అధికారి యల్లా మహాలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం చిన బ్రహ్మారెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్ రెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, పార్టీ నేతలు మోర్తల ఉమ, బొద్దూరి బ్రహ్మారెడ్డి, తుమ్మా ఇన్నారెడ్డి, మర్రి లూర్దురాజు, బి.సంపూర్ణమ్మ, ఏఈలు పాశం శ్రీనివాసరెడ్డి, షేక్ మస్తాన్ వలి, కె.నరేంద్రారెడ్డి, కార్యదర్శి జి.అనంత కోటేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కనక దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీ నగర్‌లో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారికి శ్రావణ మాసం పురస్కరించుకొని మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు హాజరైన మహిళలచే పూజ కార్యక్రమాలు నిర్వహింప చేశారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో గల వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి శ్రావణ మాసం చివరి మంగళవారం రోజు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు హాజరైన మహిళలచే ప్రత్యేక పూజలు నిర్వహింప చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి ఆటంకం లేకుండా ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



పూజ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో వాసవీ అమ్మవారు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళా భక్తులు

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

మాచవరం: మండలంలోని వేమవరం గ్రామంలో సంగం డెయిరీ పాల ఉత్పత్తి సంఘం ఆధ్వర్యంలో ఉత్పత్తిదారులకు మంగళవారం బోనస్ పంపిణీ చేశారు. గ్రామంలో 356 మంది సభ్యులకు గాను రూ.4,91,887 బోనస్ అందించారు. వీరిలో అత్యధికంగా పాల ఉత్పత్తి చేసిన పాడి రైతులు పెరుగు రామయ్యకు రూ.14,367, శానంపూడి శివారెడ్డికి రూ.12,948, ముప్పాళ్ల అంకయ్యకు రూ.11,813 నగదును అందించారు. కార్యక్రమంలో గురజాల బ్రాంచి మేనేజర్ ఉప్పలపాడి రంగారావు, గంగిరెడ్డి పాలెం ఇన్‌చార్జి మేనేజర్ కర్రి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ జి.వెంకటేశ్వర్లు, స్థానిక సంఘ అధ్యక్షుడు శానంపూడి శివారెడ్డి ఫీల్డ్ మేనేజర్, కార్యదర్శి వేణుగోపి, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



పాల ఉత్పత్తిదారులకు బోనస్ అందిస్తున్న మేనేజర్ రంగారావు తదితరులు

భూ హక్కు పత్రాలు వచ్చాయి

- తహసీల్దార్ జి. సుజాత వెల్లడి
- మండలంలోని పలు గ్రామాల్లో భూ హక్కు పత్రాలు పంపిణీ


యడ్లపాడు: దాదాపు వందేళ్ల క్రితం నాటి రికార్డులను పూర్తిగా స్వచ్ఛీకరించి భూముల సమగ్ర రీసర్వే ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చిందని తహసీల్దార్ జి సుజాత పేర్కొన్నారు. మండలం పరిధిలోని పలు గ్రామాల్లో భూ హక్కు పత్రాల పంపిణీ జరుగుతున్న నేపథ్యంలో ఆమె ఆయా వివరాలను మంగళవారం విలేకర్లకు వెల్లడించారు. మండలం పరిధిలోని 13 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా భూములను సమగ్ర రీసర్వే చేసినట్లు వివరించారు. కచ్చితమైన కొలతలతో భూములను సర్వే చేసి రైతులకు శాశ్వత హక్కులు కల్పిస్తున్నట్లు తెలిపారు. సర్వే చేయడంతో పాటు ప్రజలకు రికార్డులు సంపూర్ణంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అన్ని వివరాలతో తయారు చేసిన భూ హక్కు పత్రాలు (పట్టాదారు పాస్‌పుస్తకాలు) రైతులకు ఇస్తున్నామన్నారు. రీసర్వే వల్ల గ్రామాల్లో చాలా వరకు భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. జిల్లా నుండి యడ్లపాడు మండలానికి మొత్తం 9053 మంది రైతులకు తొలి విడతగా భూ హక్కు పత్రాలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో గ్రామాల వారీగా విశ్వనాథ కండ్రి–279, ఉన్నవ–112, యడ్లపాడు–1063, సందెపూడి–440, కారుచోల–1474, జాలాది–1300, తుర్లపాడు–962, మైదవోలు–1110, మర్రిపాలెం–174, వంకాయలపాడు–1139 రాగా ఇప్పటికీ రైతులకు ఆయా పత్రాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.



యడ్లపాడులో భూ హక్కు పత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్ జి సుజాత

జంప్ రోప్ జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పెదకూరపాడు: జంప్ రోప్ జాతీయ స్థాయి పోటీలకు విజయ విద్యావిహార్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తెనాలిలో నిర్వహించిన జంప్ రోప్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు హేమ తేజస్వని, గంటమల్లేశ్వరి, బిట్రగుంట బ్రహ్మశ్రీ, కవిత, షేక్ నూర్ అబ్బాస్ జాతీయ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులను పాఠశాల సెక్రటరీ కె.శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయుడు నోముల కోటేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ వాసంతి, ఉపాధ్యాయులు కె.రాధా, శ్రీదేవి, రజిని, అనిత, లక్ష్మీ, పవన్, రామాంజనేయులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీ కృష్ణుడి విగ్రహం ఊరేగింపు



శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

దాచేపల్లి : శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు కార్యక్రమం మంగళవారం వైభవంగా జరిగింది. ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. దేవుడే మనిషిగా పుట్టాడని ప్రజలకు తెలియజేసేందుకు గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించామని సేవాసమితి అధ్యక్షుడు ఘడియ పెద్దరెడ్డి చెప్పారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య తదితరులు శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

చిలకలూరిపేటటౌన్: మండలంలోని వేలూరు గ్రామంలో పేకాట స్థావరంపై మంగళవారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని రూ. 30,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో రూరల్ ఎస్ఐ ఎస్ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బీమాపై అవగాహన

నకరికల్లు: జేసీఎస్ యాప్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జేసీఎస్ మండల ఇన్‌చార్జి మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని చేజర్ల గ్రామంలో సచివాలయం కన్వీనర్లు, గృహసారథులకు ప్రమాద బీమాపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఫోన్‌లో జేసీఎస్ సైన్యం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు పొందుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి బొడ్లపాటి కృష్ణ కుమారి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బొడ్లపాటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పేటీయం మిషన్ల ద్వారా స్త్రీనిధి రుణాలు

శావల్యాపురం: ఇక నుంచి స్త్రీనిధి రుణాలు చెల్లింపులు పేటియం మిషన్ల ద్వారా జరుగుతాయని జిల్లా స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజరు రంతు చినబుల్లెయ్య మంగళవారం తెలిపారు. మండలంలో మూడు క్లస్టర్లు శావల్యాపురం, వేల్పూరు, కారుమంచి ఎంపిక చేశా మని జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు పథకంలో ఎంపిక చేయగా పేటీయం, క్యూఆర్ కోడ్, యూపీఐ విధానంలో ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయటానికి పేటీయం మిషన్లు అందజేశామన్నారు. ఇప్పటి వరకు యానిమేటర్ల ద్వారా క్యాష్ రూపంలో నగదు చెల్లింపులు జరిగినట్లు చెప్పారు. ఇక నుంచి నగదు రహిత లావాదేవీల చెల్లింపులు పారదర్శకంగా జరుగుతాయన్నారు. జిల్లాలో త్వరలో స్త్రీనిధి రుణాలు చెల్లింపులు ప్రతి పంచాయతీలో అమలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో స్త్రీనిధి రుణాలు ఈఆర్థిక సంవత్సరంలో రూ. 142 కోట్లు 28 వేల 400 మంది మహిళా సభ్యురాలకు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకున్నామని ఇప్పటి వరకు రూ. రూ. 31 కోట్లు 5370 మంది సభ్యులకు రుణాలను అందజేశామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలనలో స్త్రీనిధి రుణాలు ద్వారా మహిళా సభ్యులు జీవనోపాదులు పెంపుదలకు ప్రతిగ్రూపుల్లోని సభ్యురాలకు రూ. 50 నుంచి రూ. లక్ష వరకు రుణ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఆయ నతో పాటు ఏపీయం జి.వాసుబాబు, సీసీలు గొట్టం రమాదేవి, బేబిరాణి పాల్గొన్నారు.

కూరగాయల విత్తనాలు పంపిణీ

సత్తెనపల్లి(ముప్పాళ్ల): దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం గోరంట్లలోని ఎస్సీ కాలనీలో కిచెన్ గార్డెన్ ఏర్పాటులో భాగంగా ఆకుకూరలు, కూరగాయల విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. డీబీఆర్సీ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ ప్రకృతి, సేంద్రియ, ఆర్గానిక్ పంటల ద్వారా ఆరోగ్యం మెరుగు పరుచుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సేవే ప్రాణం సేవే జీవితం సంస్థ డైరెక్టర్ నందిగం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి కిలో చొప్పున మొక్కజొన్న, ఎర్రజొన్నలు, సజ్జలు 21 మందికి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సాగు చేసిన పంటల వివరాలను ఈ–క్రాప్ లో నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా 50 మంది డ్వాక్రా మహిళలకు 12 రకాల ఆకు కూరలు, కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. డ్వాక్రా యానిమేటర్ సరోజిని పాల్గొన్నారు.



గోరంట్లలో విత్తనాలు అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషిచేయాలి

20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

రెంటచింతల: గ్రామంలో వైఎస్సార్ సీపీ పార్టీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు సమష్టిగా కృషి చేయాలని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని ఎర్రబాలెం కాలనీలోని నూర్‌మసీద్ నందు స్థానిక రైలుపేట మర్కస్ మసీద్ ఇమామ్ షఫీభాయ్, మంచికల్లు ఇమామ్ షేక్ హుస్సేన్ బాషా, ఎర్రబాలెం ఇమామ్ హఫీజ్, బాలాల్ మజీద్ ఇమామ్ ఇంతియాజ్, రెంటాల మజీద్ అలీ భాయ్, మిట్టగుడిపాడు మజీద్ ఇమామ్ అబ్దుల్ ఖయ్యూం భాయ్, మేస్త్రి సైదులు, హిమాముద్దీన్, బాజీ భాయ్, తదితర మసీద్ పెద్దలు, అబ్దుల్ గఫార్ భాయ్, మీరావలి తదితర 20 మందికి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి ప్రభుత్వ విప్ పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామంలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా పార్టీ క్యాడర్ కలిసికట్టుగా ముందుకు పోవాలన్నారు. సీఎం జగన్ ప్రజలకు అందచేస్తున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రజలలోకి తీసుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య, జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం చిన బ్రహ్మారెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన నాయకులు మోర్తల ఉమ, మాజీ ఉప సర్పంచ్ ఏరువ ప్రమీలా విజయ భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు గొట్టం భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.



వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రంగా విగ్రహ ఏర్పాటు కమిటీ సమావేశం

కారెంపూడి: కారెంపూడి బస్టాండ్ సెంటర్‌లో సుమారు రూ.10 లక్షలకుపైగా వ్యయంతో ఏర్పాటు చేసిన స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ ఎప్పుడు చేయాలి ఎలా చేయాలనే దానిపై విగ్రహ ఏర్పాటుకు శ్రమించిన నాయకులు, ప్రతినిధులు మంగళవారం సమావేశమై సమాలోచనలు చేశారు. ముందుగా విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు ఆదేశాలిచ్చి భూమి పూజ చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రంగా హత్య గావించబడిన దగ్గర నుంచి విగ్రహం ఏర్పాటు చేయాలని అభిమానులు కలలు కన్నారని , అనేక సార్లు ఆలోచనలు చేశారని ఆ కల నేటికి ప్రభుత్వ విప్ పీఆర్కే సహకారంతోనెనెరవేరిందని విగ్రహ ఏర్పాటు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. త్వరలో విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించుకోవాలని సంకల్పించారు.



సమావేశంలో పాల్గొన్న దాతలు

విద్యుత్ శాఖలో విస్తృత తనిఖీలు

రూ.2 లక్షల 28 వేలు అపరాధ రుసుం విధింపు

మాచవరం: మండలంలోని మాచవరం సెక్షన్ పరిధిలోని కొత్తగణేశునిపాడు, పిల్లుట్ల, కొత్తపాలెం , గోవిందాపురం, తురకపాలెం, మోర్జంపాడు గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.హరిబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో 39 మంది అధికారులు, 117 మంది సిబ్బంది 39 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 3,630 సర్వీసులను పరిశీలించగా అనుమతులు లేకుండా, అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 122 మందికి, సుమారు రూ.2 లక్షల 28 వేలు అపరాధ రుసుం విధించినట్లు ఏఈ మస్తాన్ తెలిపారు. వీరిలో మీటర్ లేకుండా నేరుగా విద్యుత్ వాడుతున్న 69 మందికి రూ.70 వేలు, మీటర్ ఉన్నా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఆరుగురికి రూ.31 వేలు, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీలో విద్యుత్ వాడుతున్న ఒకరికి రూ.10 వేలు, అనుమతించిన లోడు కంటే అధికంగా విద్యుత్ వినియోగిస్తున్న 46 మందికి రూ.1 లక్ష 17 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు భారత విద్యుత్ చట్టం ప్రకారం నిబంధనలు తప్పని సరిగా పాటించాలని, లేకుంటే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేశారు. దాడుల్లో డీఈఈ లు ఎం.రవికుమార్, కె.రవికుమార్, టి.వీరేశ్వరావు, ఆపరేషన్ డీఈఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.